# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-10-2023** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.**

**2. తెలంగాణాతో సహా 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది.**

**3. తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన మూడు ముందస్తు బెయిల్ పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తిరస్కరించింది.**

**4. వైఎస్సార్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. పలువురికి తీవ్రగాయాలయ్యాయి.**

**5. తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత కీలకమైన సికింద్రాబాద్-నడికుడి-గుంటూరు రైలు మార్గంలో బీబీనగర్, గుంటూరు మధ్య రెండో లైను నిర్మాణ పనులకు కసరత్తు మొదలైంది.**

==========================

అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈరోజు జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల రాష్ట్ర స్థాయి సదస్సునుద్దేశించి ఆయన ప్రసంగించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 15 వేల హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని... 65 లక్షల ఇళ్ల వద్దకు వైద్య సేవలు అందిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. సంక్షేమ పథకాలు, వివిధ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చామని ముఖ్యమంత్రి వివరిస్తూ....

వాయిస్ - 42 సెకన్లు

--------------------------

2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ముందు కీలకమైన ఐదు రాష్ట్రాల ఎన్నికలకు నగారా మోగింది. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం కొద్దిసేపటి క్రితం విడుదల చేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ వెల్లడించింది. రాజస్థాన్‌కు నవంబర్ 23వ తేదీన, మధ్యప్రదేశ్‌కు నవంబర్ 17వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తామని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ తెలిపారు. నవంబర్ 7, 17వ తేదీల్లో ఆ రాష్ట్రంలో పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మిజోరంలో నవంబర్ 7వ తేదీన.. చివరగా తెలంగాణకు నవంబర్ 30వ తేదీన ఎన్నికలు

జరగనున్నాయి. అన్ని రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 3వ తేదీన విడుదల చేస్తామని రాజీవ్ కుమార్ ప్రకటించారు. షెడ్యూల్ విడుదలతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది.

---

తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్. చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన మూడు ముందస్తు బెయిల్ పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తిరస్కరించింది. ఫైబర్‌నెట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు కేసుల్లో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెలువరించింది. ఈ మూడు కేసులపై హైకోర్టు ఇటీవల విచారణ పూర్తిచేసి తీర్పును రిజర్వు చేసింది. తాజాగా ఆయా కేసుల్లో తీర్పు వెల్లడించింది. మరోవైపు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నాయుడు బెయిల్ పిటిషన్, సి.ఐ.డి. కస్టడీ పిటిషన్లపై తీర్పు విజయవాడలోని ఏ.సి.బి. న్యాయస్థానం ఈ రోజు భోజన విరామం అనంతరం వెలువరించనుంది.

మరోవైపు... చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభమైంది. సీఐడీ తనపై నమోదు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసును కొట్టివేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన ధర్మాసనం తదుపరి విచారణను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది.

---

రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రైతు భరోసా కేంద్రాలు ఉపకరణాల సరఫరా కోసమే కాదని... విత్తనం నుంచి విక్రయం వరకు అన్ని సహాయ సహకారాలు అందించేందుకు ఏర్పాటు చేశారని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ సి. హెచ్. హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది రబీ నుంచి సాధారణ పద్ధతిలో పురుగు మందులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని... ఆర్బీకేల్లో ఎరువుల అమ్మకం వ్యాపారం కాదని, రైతులకు ఒక సదుపాయం మాత్రమేనని చెప్పారు. పనిచేయని కియోస్కలను అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.

---

తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత కీలకమైన సికింద్రాబాద్- నడికుడి-గుంటూరు రైలు మార్గంలో బీబీనగర్, గుంటూరు మధ్య రెండో లైను నిర్మాణ పనులకు కసరత్తు మొదలైంది. కేంద్ర కేబినెట్ వ్యవహారాల కమిటీ డబ్లింగుకు ఆమోదం తెలపడంతో ప్రాజెక్టును మంజూరు చేస్తూ రైల్వేబోర్డు దక్షిణ మధ్య రైల్వేకు తాజాగా లేఖ రాసింది. మొత్తం నిర్మాణ వ్యయం 2 వేలు 853 కోట్ల రూపాయలుగా పేర్కొంది. ఇందులో సివిల్ పనులకు వెయ్యీ 947 కోట్లు, సిగ్నలింగ్, టెలికాం పనులకు 319 కోట్లు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ నిర్మాణ పనులకు 586 కోట్ల రూపాయిలు అంచనా వ్యయాలుగా పేర్కొంది.

---

వైఎస్సార్ జిల్లాలో ఈ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి సమీపంలో ఆర్టీసీ బస్సు-ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రొద్దుటూరు, కడపకు చెందిన 11 మంది.. ప్రొద్దుటూరు నుంచి మల్లెలకు ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో లారీని ఓవర్ టేక్ చేస్తున్న ఆటోను.. ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళా డ్రైవర్ సహా ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మృతి చెందారు.

---

తీర భద్రతలో నౌకాదళం శక్తిసామర్థ్యాల పట్ల తూర్పు నౌకాదళ ప్రధానాధికారి, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ సంతృప్తి వ్యక్తం చేశారు. సముద్రం వైపు నుంచి ఎలాంటి

ముప్పునైనా ఎదుర్కోవడానికి తూర్పు నౌకాదళానికి వున్న కార్యాచరణ సంసిద్ధతను ఆయన ఈరోజు సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. తూర్పు నౌకాదళానికి చెందిన నౌకల ద్వారా వివిధ ఉపరితల, ఉప-ఉపరితల, వైమానిక వ్యతిరేక కార్యకలాపాలను ఆయన పర్యవేక్షించారు. జలాంతర్గామి వ్యతిరేక ఆయుధ కాల్పులతో సహా విజయవంతమైన ఆయుధ కాల్పులు, అలాగే ఉభయచర కార్యకలాపాలు, వాటి సంసిద్ధతను తనిఖీ చేశారు.

-----------------------------

భారత రాజ్యాంగం దాని అనుబంధ వ్యవస్థల గురించి ప్రజల్లో చైతన్యం పెరగడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణ జరుగుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు తెలిపారు. గుంటూరులో రాజ్యాంగ చర్చా వేదిక ఆవిర్భావసభను నిన్న నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో పౌరులకు సంబంధించి ప్రాథమిక హక్కులు, న్యాయం, అభివృద్ధి ముఖ్యంగా పరిపాలన గురించి విశేషంగా చర్చించినట్టు వివరించారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచినా సామాన్య ప్రజల్లో రాజ్యాంగం పట్ల నేటికీ పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. అన్ని సమస్యలకు కోర్టులే పరిష్కారం అన్న అపోహలను విడనాడాలని సూచించారు. చట్టం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని న్యాయమూర్తి కోరారు.

-----------------------------

మహాకవి గురజాడ విశిష్ట పురస్కారాన్ని ఈ ఏడాదికి ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు ప్రదానం చేస్తామని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంలో ఉన్న గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. నవంబరు 30వ తేదీన గురజాడ వర్ధంతి రోజున 'గురజాడ సాహితీ చైతన్యోత్సవం' నిర్వహించి, ఈ పురస్కారం అందిస్తామని తెలిపారు. ఏటా గురజాడ వర్ధంతి రోజున ప్రముఖ రచయిత, సాహితీవేత్తలకు ఈ పురస్కారం అందజేస్తున్నామని, ఈ క్రమంలో ఈ ఏడాది తెలుగుపాటకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిన చంద్రబోస్‌కు ఈ పురస్కారం అందించాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. అదేవిధంగా ఈ ఏడాది జాతీయ స్థాయిలో కవితలను ఆహ్వానించి, ఉత్తమ 10 కవితలను ఎంపికచేసి, వారిని కూడా సముచిత రీతిలో సత్కరిస్తామని పేర్కొన్నారు.

-----------------------------

ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల ఆకర్షణలో విశాఖ నగరం ముందంజలో ఉందని నీతి ఆయోగ్ ప్రకటించిన నేపథ్యంలో... ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ-ఏపీఐఐసీ కూడా భారీ ఐటీ బిజినెస్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విశాఖలో ఇప్పటికే అదానీ డేటా సెంటర్‌తో పాటు ఐటీ పార్క్, రహేజా గ్రూపు ఇన్‌ఆర్బిట్ మాల్‌తో పాటు ఐటీ పార్క్ ఏర్పాటు చేస్తున్నారు. మధురవాడ హిల్ నెంబర్-3 మీద 18.93 ఎకరాల విస్తీర్ణంలో ఐ-స్పేస్ పేరుతో ఈ ఐటీ బిజినెస్ పార్కును పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ఆసక్తిగల సంస్థల నుంచి ఏపీఐఐసీ తాజాగా బిడ్లను ఆహ్వానించింది.

-----------------------------

ఏడాదికి రెండుసార్లు నిర్వహించనున్న 10, 12వ తరగతి బోర్డు పరీక్షలకు హాజరు కావడం తప్పనిసరి కాదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఇప్పటివరకూ ఒకే అవకాశం ఉందనే భయంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, దాన్ని తగ్గించడానికే ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నామని స్పష్టం చేశారు. ఢిల్లీ నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఏ విద్యార్థి అయినా మొదటి పరీక్షలోనే తనకు మంచి మార్కులొచ్చాయని భావిస్తే తదుపరి విడత పరీక్ష రాయాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇదేమీ తప్పనిసరి కాదని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఎన్ఎఫ్‌సీ విధానం ప్రకటించిన తర్వాత తాను విద్యార్థులతో మాట్లాడానని, వారినుంచి సానుకూల స్పందన వచ్చిందని వివరించారు.

====================